# మనిషి పోయేదారి

(కథానిక)

'ఎవరయ్యా నువ్వు? ఇంతరాత్రివేళ ఈ దారి పట్టిపోతున్నావు—గుండెలు తీసిన పని! పొద్దుగుంకిన తరువాత మనిషి పోయే దారే కాదిది. మన దీ ఊరు కాదా?' అని ఆ వ్యక్తి అనేసరికి సుదర్శనం మనసులో మరుగుతూన్న బాధతో ఒక వెర్రినవ్వు నవ్వేడు. మళ్ళీ మాట అందుకొని ఆ మనిషి "పిచ్చాడిలా ఉన్నావే! స్మశానమయ్యా యిది—స్మశానం! దెయ్యాలుపట్టి పీకుతాయి. రోజూ యింతకు ముందుగానే డ్యూటీ మర్తబ్ చేసుకొని పోయే వాడిని. ఇవాళ పని తెవలక జాలం అయిపోయింది. చాలా పొద్దుపోయింది. ఈ ఊరు కాదులా ఉంది నీది?" అన్నాడు. సుదర్శనం జవాబు చెప్పకుండా పైకి బాగా వినిపించేటట్టు ఒక పెద్ద నిట్టూర్పు విడిచేడు.

అత్రుత కొద్దీ ఆ మనిషి ఒక అగ్గిపుల్ల వెలిగించి, సుదర్శనం ముఖందగ్గరగా తెచ్చి చూసేసరికి ఆందోళనతో కూడిన అతని లోచనగోళాల నుంచి కన్నీరు కారుతూంది. అతని హృదయంలోని బాధను స్పష్టంగా చూసేడు ఆ వ్యక్తి. మరో అగ్గిపుల్ల వెలిగించి జాలిగా "బాబూ! మీ రెవరో చెప్పేరు కారు? కంట నీరు పెట్టుకోడానికి కారణం ఏమిటి నా తండ్రీ! వెలుగు నీడల మాదిరిగా కష్టసుఖాలు రెండూ అనుభవించినవాడిని. కాలం మళ్ళినవాడిని కాబట్టి కడుపులో బాధ కొద్దీ అడిగేను. చెప్పు నా తండ్రీ నే నడిగినదానికి" అన్నాడు ఆ తాత.

తాత వేసిన ప్రశ్నకి సుదర్శనం రక్తనాళాల లోంచి ఒక చైతన్యం పరిగెత్తినట్టయింది. మనసు చిక్కబట్టుకొని, దుఃఖరుద్ధ కంఠంతో జవాబు చెప్పేడు సుదర్శనం—"తాతా! పదునైన ఒకే ఒక ప్రశ్నతో నిరర్థకం, హేయం, నీచాతినీచంగా ఈ క్షణంవరకూ గడిచిన నా జీవిత రహస్యాన్ని పరిశీలించి, నా కర్థంకాని స్థలం లోంచి నా ప్రాణ సమానమైన ఒక అగోచర శక్తి ఆవేదనతో తను బాధపడి, నాగుండె దూసుకుపోయేటట్టు పలుకుతూన్న స్థలానికి దారి చూపేవు నా తండ్రీ! నువ్వు మహా అనుభవశాలివి. ఏడు సంవత్సరాలకు పూర్వం ఘోరమైన ఒక మహా పాపంచేసి, నాబోటి అవినీతి పరులు సాధారణంగా పోయే మార్గం పట్టిపోయి శిక్ష అనుభవించేను. మనిషి పోవలసిన దారినే కాని మనిషి పోయే దారిని కాదు పోవలసినది అని తెలుసుకోనే ప్రాజ్ఞత లేని నాకు ఆ శిక్ష చాలదు నా తండ్రీ! శిక్ష అనుభవించి, ఒక జీవచ్ఛవంలా మిగిలేను నేను" అని తల దించుకున్నాడు సుదర్శనం.

సుదర్శనం అగర్భ శ్రీమంతుడని అతడు తన ప్రశ్నకు జవాబుగా చెప్పిన మొదటి వాక్యం వినగానే తోటిమానవుడి శ్రేయస్సు కోరే తాత ముఖం ఒక గంభీరమైన ఆనందాన్ని ప్రకటించింది. "అదృష్టవంతుడివి నాయనా!" అని తాత అన్నమాటకి సుదర్శనం మళ్ళీ వడగాడ్పులాంటి ఒక నిట్టూర్పు విడిచి "కాదు" అన్న భావం జీవాన్ని కోల్పోయిన నేత్రాలలో ప్రకటిస్తూ, కళావిహీనమైన ముఖాన్ని ఒక్కసారి అటూయిటూ తిప్పేడు.

నాటికి ముప్ఫైఐదు సంవత్సరాల కాలం గడిపిన సుదర్శనం జీవితంలో ఏడు సంవత్సరాల పూర్వపు దారుణమైన ఘట్టాలు ఒకటి తరువాత ఒకటిగా వింటూ, చైతన్యంలేని ప్రతిమలా నించున్న తాత నేత్రాలు మాత్రం నిరవరోధంగా, ప్రశ్నా పూర్వకంగా సుదర్శనం ముఖంలోకి చూస్తూ అతనిని మరింత ఆందోళన పరిచేయి.

అగర్భ శ్రీమంతుడు, తల్లితండ్రులకు ఏకైక పుత్రుడు అయిన సుదర్శనం బాల్య జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా గడిచింది

అంగర వెంకట సత్యనారాయణరావు

శ్రీమంతుడు, ఉదారస్వభావుడు అయిన తండ్రి, పుట్టింటికి మెట్టింటికి ఖ్యాతితెచ్చే తల్లి, సుదర్శనానికి యుక్తవయస్సు రాగానే, తమతో సరి కాగల ఐశ్వర్య సుగుణ సంపన్నులు, సత్సంప్రదాయకులు అయిన కుటుంబీకులతో వియ్యమందారు. ఏక పుత్ర పుత్రికా సంతానపరులైన ఆ ఉభయ కుటుంబీకులు ఈ నూతన దాంపత్య జీవిత వసంతం యే మధురమంజుల గీతాలాలపిస్తుందో, ఏ ఆనంద సుమాలు పుష్పించి ఏ కమనీయ సౌరభాలు విరజిమ్ముతుందో, ఏ మధుర సుధామరీచీ వీచికలలో జోలలు పాడుతుందో అని ఊహాలకందని ఆశల్ని పెంచుకొని అదృష్టవంతులు కాబట్టి ఆయువు చాలక అనంతంలో లీనమయేరు.

ఒక్కసారి సంతోషపూర్వకంగా తల పంకించి, తరువాత?-అని ప్రశ్నాపూర్వకంగా చూసిన తాత నేత్రాలకి, జాతి ఒకటేఅయినా నీతులు విభిన్నంగా ఉండడం మానవ జీవితంలో గల దుర్దశ అంటూ జవాబు చెప్పాయి సుదర్శనం నేత్రాలు.

విస్మృతి ప్రపంచంలో విహరిస్తున్న రాధ-సుదర్శనం అర్ధాంగి-ఏడు సంవత్సరాల పూర్వం వరకూ, కామాంధకారంలో కన్ను మణిగిన సుదర్శనం దృష్టిలో రంభ కాదు. అవినీతిపరుడైన అతని దృష్టిలో శనిదేవత. భక్తితో నమ్రతతో వినయంతో, అనురాగంతో. ప్రేమతో భర్తను కొలిచే ఆసాధ్వి, తద్విరుద్ధ గుణాలు ప్రతి రక్తనాళంలోంచి అనునిత్యం హుంకరించే ఆ హంతకుడి భావనలో ఒక కత్తిపోటు. మానవ హృదయం ఊహించుకోలేని బాధలు, యాతనలు కల్పించేడు సుదర్శనం తన భార్యకి. భరించింది—ప్రత్యక్ష నరకం అనుభవించింది. కాని తన కర్మను కూడా నిందించలేదు ఆ పిచ్చి పిల్ల. అనుభవించక తప్పనిసరి అయిన పక్షంలో విధిని నిందించిన ఫలితం యేముందని విపరీతమైన స్వభావంతో, గుండె దిట్టంతో తనలో తను బాధపడేది. భర్త సౌఖ్యంకోసం, ఇంటి బాగుకోసం తనుచేసిన ప్రతి పనికీ ప్రతిఫలం హృదయం తూట్లు పడిపోయేటట్లు ఘోరమైన తిట్లు, శరీరంవిచ్చిపోయేట్టు దెబ్బలు. కానిదైవం ఆవిడ హృదయాన్ని సహనంతో నిర్మించాడు.

తాతకి గుండె బరువెక్కింది. కాని అక్కడ ప్రశ్నాపూర్వకంగా చూస్తున్న తాత నేత్రాలు అరుణారుణ బాష్పసంకలితంగా సమాధానం సమర్పిస్తూన్న సుదర్శనం లోచనగోళాలు తప్ప మిగిలినది నిర్జీవమైన నిబిడాంధకారం. బరువెక్కిన తాత హృదయం ఒకదానికి ఒకటి పొందని భావసంకులంలో మహా సముద్రంలోని తెప్పలా తేలిపోయి దరిదాపులు తెలియక కొట్టుకొంటూంది. తాత ఒక్కసారి బుర్ర ఊపేడు అవ్యక్తంగా.

సుదర్శనం దృష్టిలో రాధ రంభ కాదు. ఏవగింపు కలిగించే కురూపి. తనుచేసే అవినీతికరమైన చేష్టలకు నిత్యావరోధం. పాదరసం వంటి అతని హృదయం చంచలమై, తునియలై ఒక్కొక్క క్షణంలో ఒక్కొక్క నీచకార్యానికి పెట్టుకొనేది. కామాంధకారంలో కన్ను మణిగి, మైకం పొరలుగమ్మి, పరవనితా పేక్షతో అతను చేసిన దుష్కృత్యాలు రాధ పరోక్షంలో జరిగినంతకాలం తెరచాటు నాటకంలా గడిచేయి. ఒకవేళ ప్రత్యక్షంగా జరిగినా చిగురాకు లాంటి ఆమె హృదయం అనిర్వచనీయమైన బాధపడేకన్న గత్యంతరంలేదు. తన జీవిత సర్వస్వానికి ఏకైకాధారం అని నమ్ముకున్న భర్త వినా ప్రపంచంలో తనకి వేరే దిక్కులేదు. పరిస్థితులు ఆ విధంగా గడిచినా అమృతంలాంటి ఆవిడ హృదయం యేదో విధంగా సమాధానపడి కాలం గడిపేది.

నాటికి కొద్ది రోజులనుంచి రాధ హృదయానికి తెరచాటునుంచి కత్తి గురిపెడుతూన్న సరోజ, సుదర్శనం తన వలలో చిక్కుకున్న క్షణం నుండి తను ఆడబోయే మహా నాటకానికి సర్వసన్నాహాలు చేసుకోడం మొదలెట్టింది. సుదర్శనం ధనవంతుడూ, స్వతంత్రుడూను. కట్టుబాట్లు లేక ఒకరికి భయపడవలసిన అవసరం లేక, యిటువంటి భయంకరమైన అంధకారంలో పడిపోవడానికి అనుకూలమైన పరిస్థితిలో ఉన్నవాడు. సరోజతల్లి సోదెమ్మ ఒక చిత్తులమారి నక్క-ద్రోహాలకు, కుతంత్రాలకు పుట్టినిల్లు. నిరాధారం అయినప్పటికీ నిరంకుశంగా మాయ నాటకాలాడి, కొంపలు కూలదోసి, తనూ పిల్లా కాలక్షేపం చేస్తూండేవారు.

ఎదిగిన పిల్లని ఎరపెట్టి వలలో చిక్కిన ప్రతి హృదయ దౌర్బల్యం కలవాడినీ పీల్చి పిప్పి చేస్తూంటేది ఆ పాపాత్మురాలు. జన్మతః కులీన కుటుంబంలో పుట్టినా మచ్చుకైనా మంచి గుణం లేదు ఆ దుర్మార్గురాలి హృదయంలో. సుదర్శనంతో తమకి పరిచయం కలిగిన దగ్గర నుంచి తరుచుగా ఏదో మిషమీద సుదర్శనం యింటికి వస్తూ పోతూ, యింటి వాసాలు లెక్కెట్టడం ప్రారంభించింది. ఆ పయోముఖ విషకుంభ పలికే తేనె లొలికే మాటలు కేవలం సత్యం అనుకొనేది రాధ. పాపం శ్రుతిమించి అపస్వరాలు పలికే వరకూ అమాయకురాలైన రాధ తనకి రానున్న ముప్పు తెలుసుకోలేక పోయింది. ఒకవేళ తెలుసుకున్నా నిజంగా తను చేయగలిగింది ఏమీలేదు కూడాను.

తాము ఏమీలేని పేదవారమని, ఏదో వాదోడుగా ఉండి తలదాచుకుంటామని రాధని మధ్యపెట్టి యింట్లో ప్రవేశించారు ఆ యిద్దరూను. ఇందుకు లోపాయికారిగా సుదర్శనం అనుజ్ఞ యిదివరకేయిచ్చేడనేది ఆ అమాయకురాలికి తెలియనే తెలియదు. అప్పుడైనా రానున్న ముప్పు తెలుసుకోలేకపోయింది ఆ పిచ్చిపిల్ల.

సుదర్శనం ఎటువంటి ఘోరమైన కార్యానికి నెట్టుకుంటున్నాడో, దాని పర్యవసానం యింకా యవనికాభ్యంతరంలోనే ఉన్నా, అందువల్ల రానున్న ప్రమాదాన్ని సామాన్యంగా ఊహించుకోపాటి యింగితజ్ఞానం గల తాతకి పళ్లు బిగుసుకు పోయేయి. వడగాడ్పులాంటి నిట్టూర్పు విడిచి సుదర్శనానికి సమాధాన ప్రాయంగా "ఎంత చేసేవు నా తండ్రీ!" అనే భావంతో ఒక్కసారి బరువుగా తలపూపి, ముక్కుమీద వేలేసుకున్నాడు తాత.

దైవనిర్ణీతంగా, సహృదయ మానవాభీష్ట ఫలితంగా రాధకు ప్రాప్తించిన స్థానాన్ని, బలవంతంగా, దౌర్జన్య పురస్కరంగా సరోజ ఆక్రమించుకుంది రెప్పపాటు కాలంలో. మధుమాస, పికశారికా శ్రావ్య కూజితాలలో చివురులు తొడుగుతూన్న రాధ కోమలహృదయ రసాలంమీద విష వృష్టి కురిసింది. తన దురదృష్టం కొద్దీ సంభవించిన సాధారణమైన కష్టాన్ని, బాధని అంతవరకూ ఓర్పుతో, సహనంతో అనుభవించి, భరించిన రాధహృదయం ఉప్పెనలా పొంగి పొర్లి, చెలియలికట్టను అతిక్రమించింది. ఎంతటిదురవస్థకు లోనైపోయినా ఎంత దుఃఖభారంతో గడుస్తున్నా తన జీవితానికి అప్పటి వరకూ ఒక ఆశ అనేది ఉండేది. అది నేడు అన్యాక్రాంతం అయిపోతూంటే యింక తను ఉపేక్షించి కాలం గడపలేదు. అరక్షణీయంగా బాధపడి ఏడ్చిన తన హృదయానికి ఓర్చడానికి కన్నీరే కరువైపోయింది.

గార్హస్థ్య జీవితంలో ప్రవేశించిన తరువాత రాధకు ఎన్నడూలేని స్థానం సరోజ ఆక్రమించింది. అంధకారంలో పడిన సుదర్శనం దృష్టిలో రాధ విగతజీవి. విషప్రవాహంవంటి సరోజ మోహంలో పడి మునకలు వేస్తున్న సుదర్శనం రాధ తన కంట పడేసరికి కసిరి బుస కొట్టేవాడు. కార్చిచ్చులా ఆ తల్లీకూతుళ్లు యింట ప్రవేశించిన దగ్గరనుంచీ ఎన్నో వింతైన అంతర్నాటకాలాడుతూ, అడవి కాచిన వెన్నెలలాంటి సుదర్శనం భాగ్యరాసుల్ని అనుభవిస్తూ, యిల్లు క్రమక్రమంగా గుల్లచెయ్యడం ప్రారంభించేరు. అంతటితో ఆ చిచ్చు చల్లారలేదు. తియ్యమాటలతో ఆశ్రయంలభించేవరకూ రాధని మధ్యపెట్టిన ఆ పాపాత్ములిద్దరూ తమ ఉనికి ఆ ఇంట్లో స్థిమితపడ్డతరవాత రాధమీద అన్ని విధాలా దాడి చేస్తూ, హింసించడం ప్రారంభించేరు. నిజంగా ఆ యింటి భాగ్యభోగాలమీద జన్మహక్కు గల తన అర్ధాంగి తుచ్ఛులయిన పరాయివాళ్ళవల్ల హీనంగా అవమానించబడి, దండించబడుతూంటే తెలిసి కూడా చలించకుండా యిలా ఊరుకునే ఆ రాక్షసుడికి హృదయం లేదు.

సుదర్శనం పరోక్షంలో సరోజ ఆడుతూన్న విలాసనాటకాలు రానురాను అతీతం అయిపోయేయి. ఈ దుర్మార్గుల గాలిసోకని క్షణం వరకూ ఆ యింటి గౌరవానికి ఏమాత్రంకూడా భంగం రాలేదు. కాని యిప్పుడో నీతి నియమాలులేక ఊరకుక్కలవలె తిరిగే తుచ్ఛులకు రహదారి అయిపోయింది. చిగురాకువంటి రాధ హృదయం ఈ భయంకర వాతావరణంలో తల్లడిల్లిపోయింది. అంతటి దురవస్థలోకూడా ఆ లేత

హృదయానికి అణుమాత్రంగా ఒకే ఒక ఆశ మిగిలింది. సుదర్శనం హృదయాన్ని నిశితంగా అర్థం చేసుకున్న రాధ తన భర్తకి ఈ తెరచాటు నాటకం తెలియదని గ్రహించుకుంది. విధ్యుక్తంగా భర్తకి చెయ్యగలిగిన దేమైనా ఉంటే, అందువల్ల ఆ యింటి గౌరవ మర్యాదలు కాపాడగలిగితే ఆ అవకాశం తనకు లభించే ఆశ కలిగింది ఆ భగ్నజీవికి. కాని తన దురదృష్టంకొద్దీ అందుకు సరైన సమయంమాత్రం చిక్కడం లేదు.

రాధలో కలిగిన ఈ నూతన చైతన్యాన్ని పసిగట్టిన ఆ విషసర్పాలు రెండూ తమ పరిస్థితికి భంగం రాకుండా కాపాడుకోటానికి ఆ యింటిని గురించి ఎన్నో కల్పిత గాథలు దుష్ప్రచారం చేసి, లోతులేని మానవనైజాన్ని మోసపుచ్చుతూండేవారు. తత్ఫలితంగా లోకం మోసంలో పడిపోయి, రాధ విషయంలో సుదర్శనం ఎంతటి ఘోరానికైనా నెట్టుకుంటాడని నమ్ముతూండేది. సోదెమ్మ తన దినచర్యలో మూడువంతుల కాలం ఇరుగు పొరుగులవాళ్ళతో సుదర్శనం సంసారంగురించి అతినీచంగా చెప్పడంతో కాలక్షేపం చేస్తూ, అందు మూలంగా తమకు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరచుకొంటూండేది. అసలే సుదర్శనం నైజం ధూర్తం అని సూచాపాచంగా తెలిసిన పైవాళ్ళకి ఈ దుష్ప్రచారం మరికొంచెం నమ్మకం కలుగజేస్తుండేది. యిల్లు జారబడి వాసాలు లెక్కపెడతూ, పైగా తనకే ఘోరమైన మోసం చెయ్యడానికి ఆ యిద్దరూ తలపెడుతున్నారని తెలియడానికి సుదర్శనానికి అట్టే అవకాశం లేకపోయేది. ఎందుచేతనంటే ఆయన ఆస్తిపాస్తులు కలవాడవటం చేత వ్యవహారాల మీద తరుచు తిరుగుతుండేవాడు. పైగా యింట్లో జరుగుతూన్న వ్యవహారంగూర్చి తనకు తెలియడానికి ఒకేఒక ఆధారం కావలసిన భార్యకి తనతో ఈ విషయాలగూర్చి చెప్పడానికే కాదుకదా అసలు ఆ నిర్భాగ్యురాలికి భర్తకి ఎదురుగా పడడానికి కూడా గుండెలుండేవికావు. అతని రాక్షస ప్రవర్తనవల్ల కాని రానురాను భయంకరంగా పరిణమిస్తూన్న పరిస్థితులు చూస్తూండేసరికి, తనకి ఎంతబాధ కలిగినాసరే నిజస్థితి భర్తకి మనవి చేద్దామని తెగించి ఒక్కొక్కప్పుడు తలపెట్టేది రాధ.

ఆ దుర్మార్గులిద్దరూ యింటలేని సమయం చూసుకొని ఒకనాడు రాధ సుదర్శనందగ్గరగా గోరువంకలా వణికిపోతూ చేరి అశ్రుజలాల గుండా జాలిగా బాధతో చూస్తూ, డగ్గుత్తికతో, తెగిపోయిన మాటలతో, తమ గృహ ప్రస్తుత పరిస్థితి సంక్షిప్తంగా మనవిచేసి, గాయపడ్డ తన హృదయాన్ని ఆయన పద సమీపాన గుమ్మరించింది. కాని తప్పుతోవలో పడ్డ సుదర్శనం శిలా హృదయాన్ని ఆవిడ కన్నీటిధార ద్రవింప చెయ్యలేక పోయింది. ఒక్క కసురు కసిరి, కాలితో దూరంగా నెట్టేడు సుదర్శనం ఆవిడను. ఆశపడ్డ ఆ హృదయానికి యోచనలు నిట్టూర్పులైపోయినా, తన విధి నెరవేర్చేనన్న భావంతో, అది ఎప్పటికైనా మార్పు తేలేకపోతుందా అనే ఆశతో తృప్తి పడింది ఆ యిల్లాలు.

స్వభావరీత్యా సుదర్శనం పైవాళ్ళ నెవళ్లనీ యింట కాలుపెట్ట నిచ్చేవాడుకాడు. అతనికి స్నేహితులన్న వాళ్లు అసలే లేరు. అతని హృదయ దౌర్బల్యం కారణంగా ఆశ్రయం సంపాదించిన ఆ యిద్దరు దుర్మార్గులూ తప్పిస్తే ఆ యింట్లోకి అదివరకెన్నడూ ఎవరూ రాలేదు. కాని తను లేని సమయములో తనకంటె అవినీతిపరులు వచ్చి పోతున్నారనే సంగతి రాధవల్ల విన్నా ఆ విషయం ఏదో ఏమరుపాటుగా ఉన్నప్పుడు విన్నట్టుగానే అతని మనసులో పని చేసింది కాని అట్టే చలనం కలుగ చెయ్యలేకపోయింది అతనిలో. తనను మోసపుచ్చుతూన్న విధంగానే తనబోటివాళ్లని ఎందరినో కూడా సరోజ మోసం చేసి, పెడదారులు పెడుతున్నదని లోతులేని అతని గుండెకి ఎంతమాత్రం తట్టలేదు. ఆ విషయం సరోజకు బాగా తెలుసును. అందుగురించే తనూ తల్లీ చాలా జాగ్రత్తగా ఉండేవారు. ఒకవేళ ఈ విషయం రాధవల్ల అతనికి తెలిసినా, ఆవిడపట్ల అతనికుండే అభిప్రాయం మూలంగా అతనికి నమ్మకం కలుగ జెయ్యడానికిగాని, అతనిలో మార్పు తేవడానికిగాని నిష్ప్రయోజకం అని ఆ కులటలిద్దరికీ తెలుసు.

ఏ అభిప్రాయంతో సుదర్శనం యిల్లు ప్రవేశించిందో దాని ఫలితం చాలవరకూ దక్కినా, అలభ్యయోగంగా ప్రాప్తించిన భాగ్యభోగాల్ని విడిచిపెట్టలేక, విడవవలసిన అవసరం ఏవిధానా లేక సరోజ తన విలాసాలు సాగిస్తూ, హాయిగా కాలక్షేపం చేస్తూండేది. అంతగా చికాకు పరిస్థితి ఏర్పడే సూచన కలిగినప్పుడు అందుకు కావలసిన సన్నాహం అదివరకే అన్నివిధాలా ఏర్పరచుకొనే ఉంది.

గోరుచుట్టులాంటి తన అవస్థమీద రోకటిపోటువంటి ఈ అనుభవంతో రాధ కుంగి కృశించిపోయి, క్షణం ఒక యుగంగా బండరాతివంటి తన నిరర్థక జీవితాన్ని ఈడుస్తూండేది ఆ నిరాశాంధకారంలో. పరిస్థితులలాగే ఉన్నంతకాలం తన జీవితంలో యింక మార్పు రావడానికి అవకాశంలేదనే మనోవేదనతో బాధపడుతూండేది అంతకన్న చేసేదేమీ లేక. తెగిన గాలిపటంలాంటి తన జీవితానికి భౌతికంగా శరణ్యంలేదనే నమ్మకాని కొచ్చింది చిట్టచివరకి. ఈశ్వరుడు తన శరీరంలో నవనీతంకన్న మృదువైన హృదయాన్ని ప్రతిష్ఠించేడు. అది ఏ పరిస్థితిలోనైనా సరే ఘనీభవించి పాషాణం కాలేదు. కాని దుర్భరమైన పరపీడనాతప్తం అవుతూ క్రమక్రమంగా కరిగి నశిస్తూండేది.

•

స్వంత వ్యవహారంమీద సుదర్శనం పొరుగు గ్రామం వెళ్ళవలసివచ్చింది. పూర్వపు రోజులలో సుదర్శనం ఆ మాదిరిగానే అప్పుడప్పుడు గ్రామాంతరం వెళ్ళిన సమయంలో ఏకాకిగా ఉండవలసి వచ్చిన రాధ ఎంతో బాధపడి, ఆందోళనతో గడిపేది ఆ రెండు మూడు రోజులు ఇప్పుడు ఆయన వ్యవహారాలు, గ్రామాంతర ప్రయాణాలు, చర్యలు అన్నీ అగమ్యగోచరం. నిశ్శబ్ద నిరాశాంధకారంలో జీవనభారాన్ని ఈడుస్తూన్న రాధకి అంతా శూన్యం. సుదర్శనం వెళ్ళేడు. బరువెక్కిన నిట్టూర్పులతో బాధపడ్డది రాధ—మనసు కింపైన ఆశతో తృప్తిపడ్డది సరోజ.

సుదర్శనం దృష్టిలో రాధ రంభ కాదు. సరోజ దృష్టిలో సుదర్శనం నలకూబరుడూ కాదు. దైవప్రేరితంగా స్వర్గ వాహినిలా ప్రవహించిన సత్య ప్రేమ రాధది—ధనాశా ప్రేరితంగా విషప్రవాహంలా వచ్చిన కుహనా ప్రేమ సరోజది.

నిరవరోధంగా విలాసాలు సాగించడానికి అవకాశం మూడురోజులపాటు కలిగినందుకు సరోజ ఉప్పొంగిపోయింది. దురంతమైన అవినీతితో నిండిపోయిన తనయింట, తనభర్త పొరుగూరు వెళ్ళిన మొదటినాడు జరిగిన ఘోరాలు భరించలేకపోయింది రాధ వాటిని అరికట్టడానికి భౌతికంగా ఆవిడకు శక్తిలేదు. కాని దైవవిర్ణీతంగా ఆ యింటికి యజమానురాలు తను. ఆ యింటి గౌరవ మర్యాదల పూచీ తనది. తన పూచీ నెరవేర్చే అవకాశం కోసం తనువంతా నయనాలుగా చేసుకొని అక్కడ జరుగుతున్న ఘోరాలు కనిపెట్టి బాధపడేకన్న తను చేయగలిగింది లేకపోయింది.

మొదటి రోజు గడిచింది. సరోజకి ఇంకా రెండు రోజుల గడువుంది. రెండో రోజు రాత్రి సగం గడిచింది. వీధి తలుపు గడియతీసి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న విటుణ్ణి సాగనంపుతూంది సరోజ. సోదెమ్మ సరోజ ప్రక్కనే నిలబడివుంది. తలుపు అమాంతంగా తెరుచుకొని సుదర్శనం ప్రవేశించాడు. ఒక్క క్షణం ప్రతిమలా నిలబడ్డారు నలుగురూను. మరు క్షణంలో మొండి ధైర్యం తెచ్చుకుని చిత్తులమారి సోదెమ్మ—"నా అన్నవాళ్లని చెప్పుకోడానికి మిగిలిన ఈ అబ్బాయి మా మేనత్త మనవడు. అభిమానం పీక్కుతిన్నది కాబట్టి అంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా నిగర్వంగా వెతుక్కొని వెతుక్కొని యింత రాత్రిలో కూడా ఈ నిర్భాగ్యుల్ని చూచి పోవడానికి వచ్చేడు బాబూ! పోయిన మా బాబుని చూసినట్టుగా పొంగిపోయేను" అని సుదర్శనంతో అంటూ, లేని దుఃఖం నటించి, కళ్లు తుడుచుకుంది. శిలా ప్రతిమలా నిలుచున్న సరోజ ఒక్కసారి ఊపిరి తీసింది. ప్రక్క గదిలోంచి వింటూన్న రాధకి శరీరంలోంచి విద్యుత్తు పరిగెత్తినట్టయింది. మత్తు మందు నిషాలోవున్న సుదర్శనం మాటాడకుండా ముందుకు రెండడుగులేసి వరండాలో కాలుపెట్టేడు కొంచెం దూరంలో క్రీనీడలో జీవరహిత సాలభంజికలా

నిలుచున్నది నిరాశా స్వరూపిణి రాధ. రుధిర జ్యోతులలా వెలుగుతూన్న లోచన గోళాలలోంచి, అశ్రుజాలాల గుండా ఆవేశంతో, అవ్యక్తమైన బాధతో ఒక్కసారి ఆయన వేపు చూసి తల దించుకుంది. తన బోటి అవినీతిపరులైన మానవులు సాధారణంగా పోయే అపమార్గం పట్టిన సుదర్శనం చూపులద్వారా తనభార్య ప్రకటించిన బాధలోని వైపరీత్యాన్ని అర్థం చేసుకోలేక పోయేడు.

సరోజ మత్తుమందుతో రెండోసారి మళ్లీ నిషాలోపడ్డ సుదర్శనం జీవితం ఒక నెల్లాళ్లు మామూలు పద్ధతిలోనే నడిచింది. చిచ్చులా ఉన్న వాతావరణంలో రాధ జీవితం అంతకంతకీ దుర్భరమైపోయింది. మనిషి ఊహించుకోలేని బాధలతో నిండిపోయిన తన బ్రతుకు విధానంమీద రానురాను రాధకి ఏవగింపు కలిగింది. ఆనంద ప్రపంచంలో నిలవ నీడలేని తన జీవిత వైఖరి గురించి తనలో తను కుమిలి యేడ్చేదికాని, అందుకు ముఖ్యకారకుడైన తన భర్తగురించి యెటువంటి దురభిప్రాయం కూడా స్ఫటికంవంటి తన హృదయంలోకి జొరబడలేకపోయింది. ఏ పరిస్థితిలోనైనా సుదర్శనం తన భర్త. అందుచేతనే తనకోసంకన్న ఆయన నికృష్ట జీవితం గురించి అనవరతం బాధపడి ఏడ్చేది సమయం చిక్కినప్పుడల్లా నిట్టూర్పులతో, దైన్యం చిందిపడే దృక్కులతో ఆయనలో మార్పు తేవాలని ఆశపడేది. ఇందుకు విరుద్ధభావంతో అనునిత్యం కాచుకు తిరుగుతూన్న ఆ విషసర్పాలు రెండూ భార్యాభర్తలిద్దరు తారసపడ్డప్పుడల్లా కోపంతో, ఈర్ష్యతో బుసకొట్టేవి

రెండోసారి మళ్ళీ సుదర్శనం గ్రామాంతరం వెళ్ళేడు. తిరిగి రావలసిన గడువు దాటిపోయింది. ఆనందంలో మైమరచిపోయిన సరోజకి ఆవేదనలో జీవిత చైతన్యాన్ని కోల్పోయిన రాధకి, కాలగతి తెలియడం లేదు. రెండు రోజులు పోయినతర్వాత తలవని తలంపుగా రాత్రి మూడు పాళ్లు గడిచిన వేళకి సుదర్శనం యిల్లు చేరుకొని తలుపు తట్టేసరికి యింట్లో ఉన్న ముగ్గురు ద్రోహులకి గుండెలు గుభేలుమన్నాయి. రాధ అలికిడి యెక్కడా లేదు. రెండు నిమిషాలు పోయేక సోదెమ్మ తలుపు తీసింది. సుదర్శనం గబగబా మేడమీదికి వెళుతూంటే నక్కలా సావిట్లో నిలుచున్న సోదెమ్మ సుదర్శనం వేసిన వీధితలుపు గడియ మెల్లగా తీసింది. చప్పుడు కొంచెం వినిపించడంనుంచి సుదర్శనం మెట్లమీదనుంచి వెనక్కి తిరిగి చూసేసరికి యెవరో సగం తెరిచిన తలుపు సందులోంచి బైటికి వెళ్ళిపోతూన్నట్టు వీధి లైటు వెలుతురులోంచి కనిపించింది. శరవేగంతో మెట్లు దిగివచ్చి, గుమ్మం దాటిన ఆసామీని పట్టుకున్నాడు. ముఖం చూచేసరికి నెల రోజులకు పూర్వం ఆ వేళ రాత్రి తాను చూసిన మనిషే. కండలు తిరిగిన బలంగల సుదర్శనం విలాస పురుషుడి గుండెమీద నాలుగు తాపులు తన్ని పైకి గెంటేడు. సుదర్శనం ఉగ్రుడైపోయాడు. పిడుగులాంటి శబ్దంతో వీధి తలుపు గడియ బిగించి చరచర మేడమీదికి వెళ్లేడు. దొంగ నిద్ర నటిస్తూ, మొండిధైర్యంతో పందిరిమంచం మీద పడుకున్న సరోజను అమాంతం జుత్తు పట్టి లేవదీసాడు. వెనకనుంచి సోదెమ్మ ప్రవేశించింది. వారించడానికి ప్రయత్నించిన ఆ నక్కను ఒక్క తాపు తన్ని పక్కకునెట్టి, సరోజను చేతిబెత్తంతో తీవ్రంగా ఒళ్లు తట్లు దేరేటట్టు మోదేడు. వినరాని తిట్లు తిడుతున్న సోదెమ్మని, విషపు చూపులు చూస్తూన్న సరోజని శల్యావశిష్టం గావించి, "రాధ ఎక్కడ?" అని ప్రశ్నించేడు. జవాబు లేదు.

సుదర్శనానికి నిజంగా శరీరం మండినట్టయింది. గుండెలో మంటపుట్టించే ఒక చెప్పలేని అనుభవం పొందేడు. ఒక్కక్షణంలో మత్తుమందు నిషా పూర్తిగా విరిగిపోయింది. మానవ నైజంలో ఒకచోట గల సంకుచితత్వాన్ని, మరొక చోట గల మహా ప్రభావాన్ని విడమరచి చూడగల అవకాశం కొంచెం అప్పుడప్పుడే కలుగుతూంది. చేతులు కాలేక ఆకులు దొరికినట్టు. కాని తను అంతవరకూ పయనించిన అపమార్గానికి సుమారుగా చిట్టచివరికి వచ్చేడు.

చటుక్కుని మెట్లు దిగి తిరిగి కిందికి దారి

తీసేడు సుదర్శనం. వెనక్కి తిరగగానే తోక తొక్కిన త్రాచుపాములలాగ ఆ యిద్దరూ హూంకరించేరు. ఇంతకాలం తాము చేసిన దౌర్జన్యం తమ విలాసానికి ఉపయోగించి, ఇప్పుడు ఈ అనుభవంతో పగసాధించే బిచ్చురవుల్లో కలిపారు. అవ్యక్తమైన గాభరాతో సుదర్శనం క్రిందికివచ్చి రాధకోసం గబగబ యిల్లంతా గాలించేడు. రాధ ఎక్కడా కనిపించలేదు. వెర్రెత్తినవాడిలా యిల్లంతా తిరిగి చివరకి పెరటి వసారాను ఆనుకొనిఉన్న చీకటి కొట్టు సమీపించి లైటువేసి చూసేసరికి నిర్జీవ మానవాకారంగా కుక్కిమంచంమీద పడి ఉన్నది రాధ. సుదర్శనానికి గుండెలు బ్రద్దలైపోయేయి. దిక్కుమాలిన దీనావస్థలో జీవితాన్ని ఈడుస్తూన్న రాధ నాలుగురోజుల నుంచీ తీవ్రమైన విషజ్వరంతో బాధ పడుతూంది. తనగతి గురించి ఆలోచించే వాళ్ళు ఈ ప్రపంచంలో యెవ్వరూ లేరు. అటువంటి దుర్భరమైన పరిస్థితిలో ప్రాణరక్షణకు కావలసిన ఔషధం, ఆహారం రెండూ లేవు ఆ భగ్న జీవికి. జీవన్మరణావస్థలనడుమ కొట్టుకొంటూన్న రాధను సుదర్శనం స్పృశించగానే ఒక్కసారి కళ్ళు విప్పి చూసింది. మానవస్వభావం ఊహించుకోలేని ఆ సంఘటనతో అశపడే హృదయానికి అగమ్యగోచరంలోంచి ఒక వెలుగురేఖ కనిపించినట్టయింది. వేదనాపరితప్తం అయిన ఆ శూన్యనేత్రాలు రెండూ సుదర్శనం గుండెలు దూసుకుపోయేటట్టు ఒక్కసారి చూసేయి ఆరిపోతున్న దీపికలలా. తడి ఆరిపోయిన ఆవిడ నాలుక చూసేసరికి సుదర్శనానికి గొంతుకలో కొట్టుకుంది. గబగబ మేడ మీదకి పరిగెత్తి "పాలు, పాలు!" అని అరిచేడు. జవాబు చెప్పేవాళ్లుంటేగా. విషసర్పాలు రెండూ ఆ వాతావరణం అంతటా విషంకక్కి అదృశ్యమైపోయేయి. గాభరాతో నాలుగు మూలలూ చూచేడు. బాహ్యప్రపంచం బహు సాధారణంగా గడిపిన రాత్రి అంతమయిందని చెబుతూ గడియారం నాలుగు కొట్టింది. కాని సుదర్శనం జీవితానికి నిశీధం ప్రారంభం అయిందని చెబుతూ పెరటి చెట్టుమీదనుంచి వొక దివాంధం భయంకరంగా అరిచింది. మూడోం




చల్లదనానికి...

ఫోనిక్సు పంకా కింద కూర్చుంటే నిప్పులు కురిసే ఎండనైనా సరే ధిక్కరించ గలుగుతారు. ఎండాకాలంలో చల్లని సౌఖ్యానికి ఫోనిక్స్ పంకా సాటిలేనిది.

EW LTD.

HOENIX FANS

A.C. & D.C.

SOLE AGENTS FOR SOUTH

RM.S. & CO.LTD.,
16, BROADWAY, MADRAS.1

FEDERALS-879

విశాఖపట్టణం, తూర్పు గోదావరి జిల్లాలకు ఏజెంట్లు :

మెక్‌డొవెల్ అండ్ కో., లిమిటెడ్,
విశాఖపట్టణం.

స్టాకిస్టులు కావలెను.

తులవుపైగా పాలు ఖాళీ అయిన గాజు గ్లాసు ఎదురుగా ఉన్న టేబిల్ మీద సుదర్శనానికి కనిపించింది. అవినీతిపరుడైన మానవుడు పోయే దారి పట్టిపోయిన తనకి నిన్న మొన్నటివరకూ ఆ గళాసు ఒక మధు కలశ. మానవుడు పోవలసిన మార్గం తెలుసుకుంటూన్న తనకి నేడది విషపాత్రగా సిద్ధపడింది. కాని వెలుగు నీడల యొక్క తారతమ్యం తెలుసుకోలేని అంధకారంలో గడచిన తన జీవితం, తెలియకుండా తేజరిల్లిన వెలుతురులో దివాంధమైపోయింది గబగబ ఆ పాలు తీసుకొనివచ్చి రాధ గొంతులో పోసేడు. ఆయింట కాలుపెట్టిన దగ్గరనుంచీ ఆ క్షణంవరకూ తెలిసి తన భార్యని దారుణమైన వేదనపాలుచేసేడు. చిట్టచివరకి ఆ క్షణంలో తనలో తెలివి తెల్లవారిపోగా బాధపడుతూ ఆవిడ గొంతులో విషంపోసి ప్రాణం పుచ్చుకున్నాడు. కత్తిపోట్లవంటి బాధలో ఖండ ఖండాలుగా తెగిన రాధ హృదయంలోని అణువణువూ ఆ దుర్మార్గుణ్ణి శపించవలసింది. కాని మనిషి పోవలసినమార్గం విడవని ఆవిడపవిత్రహృదయం అతని ఊహాకందని ఆనందంతో హసించింది. నరక సమానమైన భౌతిక ప్రపంచంనుంచి కాందిశీకురాలైన ఆవిడ ముఖంమీద, ప్రాజ్ఞతగల ప్రతి మానవ హృదయాన్ని బాధపెట్టే చిరునవ్వుమాత్రం మిగిలిపోయింది.

ఏడు సంవత్సరాలనుంచీ ప్రత్యక్ష నరకంగా తను అనుభవిస్తున్న జైలు జీవితం యింక ఏడు రోజులలో పరిసమాప్తి అవుతుంది. ఏడు సంవత్సరాలుగా బాధపడి ఏడ్చిన తన హృదయానికి ప్రశాంతి లభించడానికి అవకాశం గోచరిస్తూంది. హంసతూలికా తల్పంవంటి మృదుల శయ్యా విలాసంమీద స్వర్గ సౌఖ్యం అనుభవించిన తన శరీరం ఆ బందికానాలో కటికరా నేలమీద అతి ఘోరంగా బాధ పడుతూంది. బాధ పడవలసిందే—యింకా ఎంతైనా బాధ పడవలసిందే అనుకున్నాడుసుదర్శనం. ఒకనాటి రాత్రి ఊహాకందని అగోచర ప్రదేశానికి పయనించిన తన రాధకోసం ఏడ్చిఏడ్చి, స్పృహ తప్పిపడి ఉన్న సమయంలో, పంకలగ్రావాన్ని ఆధారపరచుకున్న తన శిరస్సుకి అతి మృదువైన స్పర్శ కలిగింది. తెలివి వచ్చి చూసేసరికి తన కళ్ళని తనే నమ్మలేకపోయేడు. తను జీవించే ఉన్నాడో లేదో తెలుసుకోలేని స్థితిలోపడ్డాడు. ఎదురుగుండా నిరాధారంగా నిలబడి ఉంది తన రాధ. భయంతో గుండెలు కొట్టుకొంటూంటే వణికి పోయేడుసుదర్శనం. జీవించి దురంతమైన వేదనపాలైనప్పుడు, గతించి దైన్యానికి అంకితమైపోయినప్పుడుకూడా ఆవిడ దారి తప్పలేదు. జాలితో, బాధతో 'భయపడకండి' అన్నట్టుగా హస్తచాలనం చేసింది. ఏడు సంవత్సరాలకు పూర్వం అతను అపమార్గం పట్టినప్పుడు తను ప్రత్యక్షంగా అనుభవించినవీ, మైకంలో అతను తెలుసుకోలేక పోయినవీ ఘాతుక సంఘటనలు మానవుల ఊహాకందని భాషలో ఆయనకు స్పష్టంగా అర్థమయేటట్టు అతి సంక్షిప్తంగా మనవిచేసి, జీవితప్రయాణంలో మానవులు పోవలసిన దారిచూపింది. కత్తిపోటుకి ఖండ ఖండాలుగా తెగిపడే మనిషిలా ఈ లోకానికి సంబంధంలేని ఆ స్వరూపం అరుణారుణ బాష్పసంకలితంగా శలవు వేడుకొంటూంటే సుదర్శనానికి గుండె నీరయిపోయింది. కన్నీటితో బరువెక్కిన తల ఒక్కసారి దించి మళ్ళీ పైకెత్తేసరికి అంతా శూన్యం. క్రమక్రమంగా చీకటి తెరలను చించుకొని వెలుగులోపలికి ప్రవేశించింది. శాశ్వతంగా తెరువబడిన జైలు ద్వారంలోంచి చూసేసరికి వెలుగుతో నిండిన దారి కనిపించింది. చెరసాల విడిచి ఆ మార్గం పట్టేడు సుదర్శనం.

* * *

అంతవరకూ అచేతనంగా ఉండి, గుండె బరువుతీరేటట్టు నిట్టూర్చి నించున్న తాతదగ్గిర శలవుతీసుకొని సుదర్శనం, ఆ భయంకర వాతావరణంలో నిర్విచారంగా నిదురపోతూన్న తన అర్ధాంగి భౌతిక పరిశేషాన్ని అశ్రునిమజ్జనం చెయ్యడంకోసం కదిలిపోయాడు.

